ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

చిత్తూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 26 సెప్టెంబరు 2025



సరస్వతి స్వరూపుడిగా భక్తులకు కటాక్షం

- రెండున్నర గంటల పాటు సాగిన వాహన సేవ

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మలయప్పస్వామి వీణ ధరించి సరస్వతీదేవి అలంకారంలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం జరిగిన చిన్నశేషవాహనంలో భక్తుల రద్దీ తక్కువగానే ఉంది. గ్యాలరీలన్నీ ఖాళీగా కనిపించాయి. సాయంత్రానికి వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్న క్రమంలో రాత్రి హంస వాహన సమయంలో దక్షిణ మాడవీధి మినహా మిగిలిన గ్యాలరీలన్నీ భక్తులతో నిండిపోయాయి. దీంతో వాహనాన్ని నెమ్మదిగా కదిలిస్తూ గ్యాలరీల్లోని భక్తులకు సంతృప్తికరమైన దర్శనాన్ని కల్పించారు. దీనివల్ల అరగంట ఆలస్యంగా.. రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు వాహన సేవ సాగింది. వీఐపీలు తిరుగు ప్రయాణమైన క్రమంలో ట్రాఫిక్ ఆంక్షలను సడలించారు. రాత్రి వాహన సేవ ముందు వీఐపీల హడావుడి ఎక్కువ కాగా.. దీనిని తగ్గించాలంటూ భద్రతాధికారులను ఈవో సింఘాల్ ఆదేశించారు. ఈ వాహన సేవలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, నటి వాసూకీ, ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉదయం: చిన్నశేష వాహనంపై గరువాయూరు శ్రీకృష్ణుడి అలంకారంలో మలయప్ప కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. ఏనుగులు, అశ్వాలు ముందు కదులుతుండగా భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ వాహనసేవలు వైభవంగా జరిగాయి.





హంసవాహన సేవలో కళాబృందాల ప్రదర్శన

బ్రహ్మోత్సవాలలో నేడు | ఉదయం: 8-10 మధ్య సింహవాహనం | రాత్రి: 7-9 మధ్య ముత్యపు పందిరి వాహనం

యూనియన్ బ్యాంక్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

యాదమరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ యాదమరి శాఖలో వెలుగుచూసిన రూ.65 లక్షల విలువైన బంగారు తాకట్టు లోన్ల అక్రమాల కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. తాజాగా మరో ముగ్గురు ముద్దాయిలను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు. గత ఏడాది నవంబరులో 24మంది ఖాతాదారుల బంగారు నగల తనఖా విషయంలో అవకతవకలు జరిగినట్లు యూనియన్ బ్యాంకు అంతర్గత ఆడిట్‌లో బయటపడింది. దీనిపై గత డిసెంబర్ 6న యాదమరి పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది.మొదట ఆరుగురు నిందితులను గుర్తించారు. వీరిలో ఏ1 అబ్బూరి భాస్కర్ ఆచారి, ఏ6 పటాలం మురళిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించగా, వారికి కోర్టు కండీషన్ బెయిల్ మంజూరు చేసింది. నిందితుల్లో ఒకరైన ఏ4 భువనేశ్వరి అనారోగ్యంతో మృతిచెందారు.తాజాగా మిగిలిన ముగ్గురు ముద్దాయిలు ఏ2 అవినాష్, ఏ3 మాలిక్, ఏ5 దర్శినిలను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.మరోవైపు 24 మంది ఖాతాదారుల రూ.65 లక్షల బంగారు ఆభరణాలు రికవరీ అయ్యాయి.కోర్టు ఆదేశాల మేరకు బ్యాంక్ సిబ్బంది సంబంధిత ఖాతాదారుల లోన్ మొత్తాన్ని చెల్లించిన అనంతరం ఆభరణాలు అప్పగించే ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ



చౌడేపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో గురువారం బోయకొండ గంగమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఒక చేతిలో అక్షయ పాత్ర, మరో చేతిలో గరిట, ఇంకో చేతిలో కమలం, మరో చేయి అభయ హస్తంగా చతుర్భుజాలతో గంగమ్మను అలంకరించారు.డార్మిటరి హాల్లో కళశ స్థాపన చేసి ఉత్సవమూర్తిని ఆశీనులను చేశారు. రాయచోటికి చెందిన శేఖర్ మహ్మద్‌ఆలీ, హీమాంబీ దంపతులు ఉభయదారులుగా రూ.5116 చెల్లించి మహా గణపతి, ఆదిత్యాది నవగ్రహ, దుర్గ చండీ, మృత్యుంజయేశ్వర, రుద్ర హోమంలో పాల్గొన్నారు.అమ్మవారిపై భక్తితో ఏటా ఉభయదారులుగా పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.



చిత్తూరు గిరింపేటలో పార్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ



ఉభయదారులు మహ్మద్‌ఆలీ, హీమామ్‌బీ దంపతులకు ప్రసాదాలందిస్తున్న ఈవో ఏకాంబరం



ఆనందోత్సాహాలు

1529మంది టీచర్లకు నియామక పత్రాలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన 1529మంది టీచర్లు గురువారం నియామక పత్రాలు అందుకున్నారు.విజయవాడలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వీరు సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.వీరితో పాటు సహాయకులు, అధికారులు 3368మంది జిల్లానుంచి హాజరయ్యారు.



పారిశుధ్య కార్మికులపై పనిభారం తగ్గిద్దాం

కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు



చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద తదితరులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులపై పనిభారం తగ్గిద్దామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా గురువారం చిత్తూరు గంగినేని చెరువులో చెత్తాచెదారాన్ని మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. మేయర్, కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్, కార్పొరేటర్ ఇందు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

హైరోడ్డు విస్తరణకు ఆర్డీప్లాన్ ఆమోదం



ఆర్డీ ప్లాన్‌ను విడుదల చేస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర తదితరులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరాభివృద్ధిలో భాగంగా హైరోడ్డు విస్తరణకు కీలకమైన మరో అడుగు పడింది. కట్టమంచి రైల్వే బ్రిడ్జి నుంచి హైరోడ్డు కృష్ణుడి గుడి వరకు 750 మీటర్ల మాస్టర్‌ప్లాన్‌లో అప్రూవల్ అయినటువంటి రోడ్డు వంద అడుగుల విస్తరణకు సంబంధించి రోడ్ డెవలప్‌మెంట్ (ఆర్డీ) ప్లాన్ అధికారికంగా ఆమోదం పొందింది. ఈ ఆమోదపత్రాన్ని గురువారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ నరసింహ ప్రసాద్ విడుదల చేశారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి భవిష్యత్తు రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు నాగేంద్ర, శుభప్రద, బిల్డింగ్ సూపర్‌వైజర్ బాలాజీ, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి విషాదం

- కారు ప్రమాదంలో తిరుపతికి చెందిన తండ్రి, కుమార్తె దుర్మరణం
- క్షతగాత్రుల్లో కార్పొరేటర్ అన్నా సంధ్య పరిస్థితి ఆందోళనకరం





డాక్టర్ వెంకటకిషోర్ (ఫైల్ ఫొటో) - మృతి చెందిన అశ్వినందన



ప్రమాద స్థలంలో కారు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బీసీ నేత అన్నా రామచంద్రయ్య ఇంట విషాదం నెలకొంది. గుంటూరులో జరిగే బంధువుల ఫంక్షన్‌కు వెళ్తుండగా బుధవారం అర్ధరాత్రి 10.30 గంటలకు వీరి కారుకు చిలకలూరిపేట వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రామచంద్రయ్య అల్లుడు డాక్టర్ వెంకటకిషోర్(42), మనవరాలు అశ్వినందన (4) మృతిచెందగా, మిగిలిన ఐదుగురు గాయపడ్డారు. వీరిలో కార్పొరేటర్ అన్నా సంధ్యకు తీవ్రగాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన తంగెళ్ల వెంకట కిషోర్ స్విమ్స్‌లో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఈయన అన్నా రామచంద్రయ్య పెద్ద కుమార్తె డాక్టర్ అన్నా సంధ్యను వివాహం చేసుకున్నారు. ఈమె కార్పొరేటర్. రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని బాలాజీ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్. వీరికి కుమారుడు ఆయుష్ నందన, కుమార్తె అశ్వినందన ఉన్నారు. గుంటూరులో ఫంక్షన్ కోసం ఈ నలుగురితో పాటు అన్నా రామచంద్రయ్య కోడలు డాక్టర్ శ్వేత, ఆమె కుమార్తెలు అన్నా ఆద్య(8), అన్నా షైరా కలిసి బుధవారం రాత్రి పది గంటల ప్రాంతంలో మహేంద్ర ఎక్స్ యూవి 700 కారులో బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 2.15 గంటల ప్రాంతంలో మార్టూరు చిలకలూరిపేట మధ్య తాతపూడి ఫ్లై ఓవర్ వద్ద వీరి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటకిషోర్ కారు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. తలపై బలమైన గాయాలైన చిన్నారి అశ్వినందనను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. కారు ముందు సీట్లో ఉన్న కార్పొరేటర్ అన్నా సంధ్య కాళ్లకు తీవ్ర గాయాలవడంతో గుంటూరులోని రమేష్ ఆస్పత్రికి తరలించినట్లు చిలకలూరిపేట ఎస్ఐ అనిల్‌కుమార్ చెప్పారు. మిగిలిన నలుగురికి చిలకలూరిపేటలోని ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి రేపల్లెలోని వెంకటకిషోర్ ఇంటికి తరలించారు. అక్కడే దహన సంస్కారాలు నిర్వహించనున్నారు. అతి వేగంతో పాటు నిద్రమత్తు వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో 'అన్నా' ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. అన్నా రామచంద్రయ్య ఆయన కుటుంబ సభ్యులు చిలకలూరిపేటకు వెళ్లారు. ఇక, చిలకలూరిపేటలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన వారు ఆయన బంధువులని సమాచారం. కాగా, వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి కూడా తిరుపతి నుంచి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించారు.

నాన్నంటే ప్రేమ: నాలుగేళ్ల అశ్వినందనకు నాన్న వెంకట కిషోర్ అంటే విపరీతమైన ప్రేమ అని కుటుంబీకులు చెబుతున్నారు. అతడిని వదిలి ఉండేది కాదని.. మృత్యువులోనూ ఆయన వెంటే వెళ్లిందంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వీఎస్వోలకు ప్రశంస



రాంకిషోర్‌ను, సురేంద్రను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

ప్రపంచ పోలీస్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన టీటీడీ విజిలెన్స్ వీఎస్వోలను సీఎం చంద్రబాబు అభినందించారు. బర్మింగ్‌హామ్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ పోలీస్, ఫైర్‌గేమ్స్-2025లో వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర స్వర్ణ, కాంస్య పతకాలను సాధించారు. వీరు గురువారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయాన్ని వివరించారు. వీరిద్దరినీ చంద్రబాబు అభినందిస్తూ పట్టువస్త్రంతో సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రూ.5 లక్షల టపాకాయలు సీజ్


తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శివకాశి నుంచి కొరియర్ ద్వారా అక్రమంగా తెప్పించిన రూ.5 లక్షల టపాకాయలను గురువారం తిరుపతి ఈస్ట్, అలిపిరి పోలీసులు సీజ్ చేశారు. జీఎస్టీ చెల్లించకుండా రెండు నెలలుగా కొరమేనుగుంటలోని మిట్టూరు ట్రాన్స్‌పోర్టు ద్వారా 27 బాక్సులు తెప్పించారని అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపారు. గురువారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలంకు అందిన సమాచారం మేరకు ఈస్ట్, అలిపిరి సీఐలు శ్రీనివాసులు, రాంకిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది దాడి చేసి సీజ్ చేశారు. అనుమతుల్లేకుండా.. భద్రతా ప్రమాణాలు పాటించకుండా టపాకాయలు నిల్వఉంచిన ఆరవాణా కంపెనీపై కేసునమోదు చేశారు.

పలువురు మున్సిపల్ అధికారులకు నోటీసులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన అవకతవకలకు సంబంధించి పలువురు అధికారులకు, సిబ్బందికి నోటీసులు జారీ అయ్యాయి. గతంలో నగరపాలక సంస్థ ద్వారా కొనుగోలు చేసిన 10 ఫాగింగ్, 10 గడ్డికోత యంత్రాల విషయంలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలపై పూర్వపు కమిషనర్ అరుణను, అప్పటి ఎంహెచ్‌వో అనిల్‌కుమార్‌ను, జూనియర్ అసిస్టెంట్ భారతిని ప్రభుత్వం సంజాయిషీ కోరింది. అలాగే కారుణ్య నియామకం ద్వారా పారిశుధ్య ఇన్స్‌పెక్టర్‌గా అక్రమ మార్గంలో పదోన్నతి పొందిన చిన్నయ్యను వివరణ కోరింది. ఈయన నియామక సందర్భంలో కమిషనర్లుగా పనిచేసిన వర్మ, రాజేంద్రప్రసాద్, ఎంహెచ్‌వో సుమతి, సీనియర్ అసిస్టెంట్ విజయసింహారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఆదాంకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది.



వెంకన్నకు తాత తిరుమల నంబి



చిత్రం: శింగిరి మునెయ్య

తిరుమల శ్రీవేంకటేశ్వరుని భక్తాగ్రేసరుల్లో అగ్రగణ్యుడు తిరుమలనంబి. 10వ శతాబ్దంలో శ్రీరంగం నుంచి తిరుపతికి చేరుకున్న భక్తుడు ఈయన. శ్రీవారికి తీర్థకైంకర్యాలు ప్రారంభించిన వాడు. భగవద్రామానుజులకు మేనమామ, గురువు. తిరుమల క్షేత్రం సేవలోనే జీవితం గడిపినవాడు. సాక్షాత్తూ వెంకటేశ్వరుడిచే తాతా అని పిలిపించుకున్న భక్తుడు. తిరుమల ఆలయప్రాకార మాడవీధిలో తిరుమలనంబి సన్నిధి ఉంది. ఉత్సవాల్లో ఇక్కడ ఆగి హారతి తీసుకుని స్వామి ముందుకు కదులుతాడు. ప్రతిరోజూ ఉదయం తిరుమలలో శ్రీవారి పూజా కైంకర్యాలు ముగించుకుని తిరుమలనంబి అలిపిరికి చేరుకునేవారు. గోవిందరాజస్వామిని సేవించుకుని రామానుజాచార్యులు ఆదే సమయానికి అక్కడికి వచ్చేవారు. ఒక రాతిగుండు పక్కన చింతచెట్టుకింద రామాయణ ఉపదేశాలను మేనల్లుడైన రామానుజులుకి వినిపించేవారు. ఈ ఉపదేశాలను అనుగ్రహించి అలిపిరిలో శ్రీవారు తన పాదముద్రలు విడిచారట. అవే అలిపిరి శ్రీవారి పాదాలుగా నేటికీ భక్తుల పూజలందుకుంటున్నాయి.

గంటపాటు ఆలయంలో ఉప రాష్ట్రపతి, సీఎం



ఉప రాష్ట్రపతికి చిత్రపటం బహూకరిస్తున్న సీఎం, టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం గంటపాటు తిరుమల ఆలయంలో గడిపారు. ఉదయం 8.35 గంటలకు మహద్వారం నుంచి ఆలయప్రవేశం చేశారు. గర్భాలయంలోని శ్రీవారిని దర్శించుకుని 9 గంటలకు రంగనాయక మండపానికి చేరుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం తర్వాత 9.25 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు. బయట వాహనాల వద్దకు వెళుతూ గ్యాలరీల్లోని భక్తులకు అభివాదం చేశారు. సమీపంలో ఉన్న కొందరు పిల్లలను సీఎం ఆప్యాయంగా పలకరించారు. వీరిద్దరు ఆలయం వెలుపలకు వచ్చే క్రమంలో కొద్ది సమయంలో అన్నదానం సమీపంలో వాహనాన్ని ఆపడంతో పాటు అక్కడక్కడ గేట్లు వేశారు. దీన్ని గమనించిన సీఎం వెంటనే గేట్లు తెరవాలని ఆదేశాలిచ్చారు. దీంతో వాహనసేవ యదావిధిగా ముందుకు సాగింది.

వీవీఐపీల సందడి : బ్రహ్మోత్సవాల ప్రారంభం సమయంలో తిరుమల మొత్తం వీవీఐపీలతో హడావుడిగా కనిపించింది. పట్టువస్త్రాలు సమర్పించడానికి వచ్చిన సీఎంతో పాటు ఉపరాష్ట్రపతి, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఉండడంతో తిరుమల క్షేత్రం సైరన్లమోతతో మారుమోగింది. వీవీఐపీలు వెంట ఉన్నాతాధికారులు అంతా ఉండాల్సిరావడంతో గురువారం ఉదయం జరిగిన చిన్నశేషవాహన సేవలో చాలా మంది ఉన్నతాధికారులు పాల్గొనలేకపోయారు. ప్రారంభం, ముగింపులో మాత్రమే ఉన్నతాధికారులు కనిపించారు. వీఐపీల వల్ల అక్కడక్కడ గేట్లకు తాళాలు వేయడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులు కూడా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రధానంగా రాంభగీచా, మినీషాపింగ్ కాంప్లెక్స్ వంటి ప్రాంతాల్లో ఈ సమస్యలు కనిపించాయి.

కనువిందు చేసిన కళోత్సవం






తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గురువారంనాటి చిన్నశేష వాహన సేవలో కళా ప్రదర్శనలు కనువిందు చేశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 18 కళాబృందాల్లోని 430 మంది కళాకారులు తమ కళా విన్యాసాలతో అబ్బురపరిచారు. విశాఖపట్నం సునీత బృందం ప్రదర్శించిన గోవింద గానం నృత్యం వేంకటేశ్వరస్వామి వైభవాన్ని చాటింది. తెలంగాణకు చెందిన గౌరవిరెడ్డి బృందం కుంభ మయూర నృత్యం నెమళ్లు సంచరించిన అనుభవాన్ని కలిగించింది. మహారాష్ట్ర తరుణశేఖర్ జానపద బృందం ప్రదర్శనలో కళాకారుల భంగిమల్లో మెరుపు వేగం అబ్బురపరిచింది.



కర్ణాటకకు చెందిన డాక్టర్ దర్శిని మంజునాథ్ బృందం శ్రీకృష్ణలీలా తరంగిణి నృత్యరూపకం అకర్షించింది. మండపేటకు చెందిన వీరవేణి బృందం కోలాటం, కడప జిల్లాకు చెందిన బాబు బృందం డ్రమ్ములయ విన్యాసాలు, విశాఖపట్నంకు చెందిన లక్ష్మీబృందం శ్రీకృష్ణ రసలీల రూపకం ఓలలాడించాయి. కేరళకు చెందిన అభిషేక్ బృందం కథకళి, పాండిచ్చేరికి చెందిన తిరుమురగన్ కరగట్టం ప్రదర్శించారు. తిరుపతి వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాలకు చెందిన డాక్టర్ ఉషారాణి ప్రదర్శించిన దేవేరుల చిన్న వాహన సేవ, మహారాష్ట్రకు చెందిన రాహుల్ హల్దే బృందం హోలీ నృత్యం, సీహెచ్ అజయ్ బృందం కూచిపూడి నృత్యం,గూడూరుకు చెందిన శైలజా కుమారి బృందం భక్తప్రహ్లాద రూపకం, అస్సాంకు చెందిన జోయ్‌దేవ్ దేకా బృందం బోర్తాల్ నృత్యం, పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రసూన్ బెనర్జీ బృందం జుహ్మర్ నృత్యం నేత్రపర్వంగా సాగింది.త్రిపురకు చెందిన రాజు యోగ్ బృందం సన్షైన్ గొడుగుల నృత్యం, తూర్పుగోదావరి జిల్లా తణుకుకు చెందిన హారిక బృందం, తిరుమలకు చెందిన శ్రీనివాసులు కోలాట నృత్యాలతో తన్మయపరిచారు. వాహన సేవ కొనసాగుతున్నంత సేపు మహావీధుల్లో కళా ప్రదర్శనలు భక్తులను కనువిందు చేశాయి.





క్షేత్రస్థాయిలోనే అంటువ్యాధులపై దృష్టి పెట్టాలి

కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డీఎంహెచ్‌వో, ప్రోగ్రామ్ అధికారులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలోనే అంటువ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. విజయవాడ నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక ఆశ కార్యకర్తతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. డయేరియా కేసులు నమోదైన వెంటనే ఆ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాధారణ కాన్పులన్నీ పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లోనే నిర్వహించారు. హైరిస్క్ కేసులను ముందుగా గుర్తించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ అభ ఐడీ కార్డులు నమోదు చేయాలన్నారు. ఎన్‌సీడీ సర్వేను నాణ్యతగా నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని విరమించుకోవాలి

● సీపీఐ(ఎంఎల్) డిమాండ్



విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మిట్టూరులోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఈ మేరకు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే విద్యుత్ వినియోగదారులపై మోయలేని భారం పడిందని చెప్పారు. స్మార్ట్ మీటర్లు పెడితే మరిన్ని కష్టాలు తప్పవన్నారు. స్మార్ట్ మీటర్లు వల్ల ప్రధాని మోదీ మిత్రుడు అదానీకి మేలు చేయడానికి ప్రభుత్వం తహతహలాడుతోందని విమర్శించారు. నాయకులు సదాశివ, నగరాజు, వసంతరాజు, లత, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి మహిళ మృతి

● 11 మందికి గాయాలు



మృతి చెందిన అలివేలమ్మ - ప్రమాద స్థలంలో పరిశీలిస్తున్న ఎస్ఐ సుబ్బారెడ్డి

రొంపిచెర్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి ఓ మహిళ మృతిచెందగా.. 11 మంది గాయపడిన సంఘటన గురువారం రొంపిచెర్ల మండలం బోణంవారిపల్లె సమీపంలోని తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు... రొంపిచెర్ల మండలం చెంచమరెడ్డిగారిపల్లె పంచాయతీ పిచ్చికుంట్లవారిపల్లెకు చెందిన మహిళలు అన్నమయ్య జిల్లా కలకడకు టమోటాలు కోసేందుకు ఆటోలో వెళ్తుండగా జాతీయ రహదారిపై వ్యతిరేక మార్గంలో వెళ్తూ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో అలివేలమ్మ (53) మృతిచెందగా .. రత్నమ్మ, లక్ష్మీదేవి, కాంతమ్మ, రాణి, రమాదేవి, నారాయణమ్మ, కమలమ్మ, నాయణమ్మ, సి.రాజేశ్వరి, కృష్ణవేణిలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సుబ్బారెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరపట్లపల్లె వద్ద హెరిటేజ్ చిల్లింగ్ సెంటర్

100శాతం మహిళలతో నడిపిస్తామన్న ఎండీ నారా భువనేశ్వరి



హెరిటేజ్ చిల్లింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

గంగవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):గంగవరం మండలం సరపట్లపల్లె వద్ద హెరిటేజ్ ఫుడ్స్ ఆధ్వర్యంలో నూతన చిల్లింగ్ సెంటర్‌ను కంపెనీ ఎండీ నారా భువనేశ్వరి ప్రారంభించారు.హెరిటేజ్ ద్వారా దేశవ్యాప్తంగా రోజూ 18 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నామన్న ఆమె ఈ చిల్లింగ్ సెంటర్‌లో మహిళా సాధికారతకు పెద్దపాట వేశామన్నారు. 100శాతం మహిళలే పనిచేయడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు.మొదట 30 గ్రామాల్లో పాలను సేకరించి, త్వరలోనే 60 గ్రామాలకు విస్తరింపజేయడానికి కృషి చేస్తామన్నారు.హెరిటేజ్ ద్వారా ఉచిత బీమా, పశు బీమా సేవలు, ఉచిత పశువైద్య శిబిరాలు, పశు దాణా సరఫరా, రుణ సహాయం తదితర సేవలను రైతులకు అందిస్తున్నామన్నారు.హెరిటేజ్ అధికారులు రామ్మోహన్‌బాబు, గోపాలకృష్ణన్, బానోత్ శ్రీను, సర్వోత్తమ రెడ్డి, హరిబాబు, ఆదినారాయణ, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో నర్వి వైద్య సేవలు

● వారానికి రెండ్రోజులు ప్రీతం ఆస్పత్రిలో వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్ జార్జ్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నర్వి వైద్యసేవలను చిత్తూరులోని తమ ఆస్పత్రిలో పొందవచ్చని ప్రీతం ఆస్పత్రి అధినేత డాక్టర్ రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఓవర్ బ్రిడ్జ్ వద్ద ఉన్న ఆస్పత్రిలో వేలూరు నర్వి ఆస్పత్రి వైద్య నిపుణులు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హార్ట్ అండ్ న్యూరాలజీ సేవలను పొందడానికి రోగులు చిత్తూరు నుంచి చెన్నై, వేలూరుకు వెళ్తుంటారన్నారు. ఇప్పుడు ఆ సేవలను తమ ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నర్వి ఆస్పత్రి కార్డియాక్ సర్జన్ డాక్టర్ వినాయక్ శుక్లా మాట్లాడుతూ.. నెలలో రెండ్రోజులు చిత్తూరులో వైద్య శిబిరం నిర్వహించి, పరీక్షలు చేస్తామన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి వేలూరు నర్విలో ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. అనంతరం నర్వి ఆస్పత్రి గుండె వైద్య నిపుణుడు డాక్టర్ జార్జ్, న్యూరో సర్జన్ డాక్టర్ లోకేష్‌లు పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్వి ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శరవణన్, ప్రీతం ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులోనే సర్వేశాఖ డీడీ కార్యాలయం

● డీడీ జయరాజ్



జయరాజ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే, ల్యాండ్ రికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పోస్టును మంజూరు చేసింది. కలెక్టరేట్‌లోని ఏడీ కార్యాలయంలోనే డీడీ కార్యాలయం కొనసాగుతుంది' అని డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) టి.జయరాజ్ తెలిపారు. గురువారం కార్యాలయంలో డీడీగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను పలువురు సర్వేయర్లు, సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా డీడీ మీడియాతో మాట్లాడుతూ.. ఇకపై ఉమ్మడి జిల్లాలో జరిగే సర్వే కార్యక్రమాలకు చిత్తూరు కేంద్రంగా పనిచేస్తుందని తెలియజేశారు.

అవాంతరాల్లేకుండా రీసర్వే నిర్వహిస్తున్నాం

రీసర్వే కార్యక్రమాన్ని అవాంతరాల్లేకుండా జిల్లాలో నిర్వహిస్తున్నామని జయరాజ్ తెలిపారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూముల గుర్తింపు కార్యక్రమం చురుగ్గా సాగుతున్నదన్నారు. 2024 అక్టోబరు నుంచి గురువారం వరకు తమ భూములు సబ్ డివిజన్ చేయాలంటూ ఆన్‌లైన్ ద్వారా 11,945 దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో 8216 పరిశీలించి హద్దులను నిర్ణయించామని, 2826 తిరస్కరించగా, ప్రస్తుతం 903 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. పట్టా సబ్‌డివిజన్‌పై రైతుల నుంచి 897 దరఖాస్తులందగా, 595 పరిష్కరించామని, 252 తిరస్కరించగా, 50 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎఫ్‌లైన్లు కొలతల కోసం 8577 దరఖాస్తులందగా, 7167 పరిష్కరించామని, 986 తిరస్కరించగా, 430 పెండింగ్‌లో ఉన్నట్లు తెలియజేశారు. 33,481 జాయింట్ ఎల్పీఎంల కోసం దరఖాస్తులు అందగా, 4140కి రైతులు నిర్ణీత ఫీజును చలాన్ల రూపంలో ప్రభుత్వానికి చెల్లించారని, వీటిలో 3529 డిస్పోజ్ చేశామన్నారు. 10,365 మంది పట్టాదారులు భాగపరిష్కారానికి ముందుకు రావడంలేదని, 18,976 దరఖాస్తులు భూపరిష్కారానికి అనర్హులైనట్లు గుర్తించామని తెలిపారు.

రెవెన్యూ కేసులకు కౌంటర్ దాఖలు చేయండి

● అధికారులకు కలెక్టర్ సూచన



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన కోర్టులో నమోదైన రెవెన్యూ కేసులకు సంబంధించి రెండ్రోజుల్లో రిటర్న్ స్టేట్‌మెంట్, కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పెండింగ్‌లోని రెవెన్యూ కేసులపై డీఆర్వో మోహన్‌కుమార్‌తో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీవోలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా ప్రధాన న్యాయస్థాన ప్రాంగణంలోని 14 కోర్టుల పరిధిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 59 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. వీటిల్లో 27కేసులు ఎక్స్ పార్టీగా గుర్తించడం జరిగిందని చెప్పారు. వీటికి సంబంధించి వెంటనే తహసీల్దార్లు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన నైతిక బాధ్యత తహసీల్దార్లదే అన్నారు. ఈ-కోర్టు వెబ్‌సైట్‌లో కేసుల వివరాలు, వాటి తాజా పరిస్థితిని పరిశీలించుకోవాలన్నారు. జిల్లా కోర్టులోని రెవెన్యూ కేసులకు సంబంధించి తహసీల్దార్లను సమన్వయపరిచేలా వీఆర్వోస్థాయి సిబ్బందిని లైజన్ ఆఫీసర్‌గా నియమిస్తామని తెలియజేశారు.

మహిళల ఆరోగ్యమే దేశ సౌభాగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ యల్లయ్య

కల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని సింగిల్ విండో అధ్యక్షులు ధనంజయనాయుడు, ప్రభుత్వ వైద్యాధికారులు వేణుగోపాల్‌రెడ్డి, యల్లయ్య, రమ్యశ్రీ తెలిపారు. పులిచెర్ల మండలం పాపిరెడ్డిగారిపల్లి, ఎల్లంకివారిపల్లి పంచాయతీలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మహిళలకు మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, క్యాన్సర్, క్షయవ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు గర్భాశయం, గొంతు, రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలని, యోగా, ధ్యానం చేయాలని తెలిపారు. టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, మహేష్, గోపినాయుడు, దేవేంద్ర, సురేంద్ర, జయచంద్ర, బాలాజి, నజీర్, సుబ్బరాజు, సుదాకర్‌రెడ్డి, గురప్ప, ఆనంద, హరి, మునీంద్ర, జ్యోతికుమార్ పంచాయతీ కార్యదర్శులు దినేష్, ప్రవీన్‌కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు సంస్కరణలతో విద్యుత్ కోతలకు చెక్



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేపట్టిన విద్యుత్ సంస్కరణలతో ప్రస్తుతం విద్యుత్ కోతలకు చరమగీతం పాడారని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి తెలిపారు. గురువారం రామకుప్పం మండలం గూళిపల్లె గ్రామంలో 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలకు 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, వ్యవసాయ కనెక్షన్లకు 8 గంటలు త్రీఫేస్ సరఫరాకు శ్రీకారం చుట్టిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, నేతలు శ్రీనివాసులురెడ్డి, సత్తి, కృష్ణారెడ్డి, మణేష్, శంకర్‌చలం, మహేంద్రనాయుడు, సంపంగిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

130 మందికి ఉచిత వైద్య సేవలు



బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురంలో స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 130 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి చేతులమీదుగా బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయకుమారి, వైద్యులు బాలాజీ, నమ్రత, రమ, కాషిఫ్, నేతలు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, కృష్ణారెడ్డి, కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చెత్త తొలగింపు



డిగ్రీ కళాశాలలో చెత్తను తొలగించిన తిరుమల డెయిరీ సిబ్బంది

పలమనేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తిరుమల డెయిరీ సిబ్బంది ప్రపంచ పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలిగించారు. ఈ సందర్భంగా డెయిరీ మేనేజర్ పత్తినాయుడు మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్రశ్నార్థకంగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని అందరూ మానుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని విడిచి మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో తిరుమల డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

గుడుపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కుప్పం మార్కెట్ కమిటీ చైర్మన్ మునిరాజు అన్నారు. గురువారం మండల సమైక్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామానికి ఎఫ్‌పీవో గ్రూపులు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రూపులను సక్రమంగా నడిపి మహిళలను ఆర్థికంగా ఎదగడానికి మండల సమైక్య కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు సుబ్రహ్మణ్య, నేతలు బాలాజీ, ఉదయ్ కుమార్, ఏపీఎం గ్రీటా, సీసీ, ఫార్మా మిత్రలు, మహిళా సమఖ్య సభ్యులు పాల్గొన్నారు.



వి.కోటలోని కాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మ, దుర్గమ్మ సేవలో భక్తులు



పుంగనూరు: చదళ్లలో కంచికామాక్షిదేవి అలంకరణలో చౌడేశ్వరీదేవి



పుంగనూరు : గాయత్రిదేవి అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



నరసింహావతారంలో కల్యాణ వెంకటరమణస్వామి

వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రత్యేకాలంకరణల్లో దేవతామూర్తుల దర్శనం



చౌడేపల్లె : ఉభయదారులచే హోమం చేయిస్తున్న వేదపండితులు



చౌడేపల్లె : బోయకొండలో కళశ స్థాపన, బోయకొండ గంగమ్మ తల్లి

చౌడేపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దసరా మహోత్సవంలో మూడోరోజు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహా గణపతి, ఆదిత్యాధి నవగ్రహ, దుర్గ చండీ, మృత్యుంజయేశ్వర, రుద్ర , హోమాలు నిర్వహించారు. అనంతరం ఉభయదారులకు అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను ఆలయ ఈవో ఏకాంబరం అందజేశారు.

● **పుంగనూరు:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పుంగనూరు మున్సిపాలిటీ, గ్రామీణ మండలంలోని అమ్మవారి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ఉదయం అష్టలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విరూపాక్షిమారెమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయాల్లో ఉత్సవాలు చేపట్టారు.

● **రామకుప్పం:** రామకుప్పం మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రుల్లో నాలుగో రోజైన గురువారం పూజలు నేత్రపర్వంగా జరిగాయి. రామకుప్పంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ, కాశీవిశ్వేశ్వరాలయం, ఆనిగానూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ, కంబాల దేవులపల్లె సప్తమాతృకా చౌడేశ్వరమ్మ ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి విశేష అలంకరణలు చేశారు.

● **గుడుపల్లె:** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలలోని రైల్వే క్రాస్‌లో సమీపంలో కొలువైన రాళ్లగంగమాంబ గురువారం కాత్యాయణీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● **రొంపిచెర్ల:** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రొంపిచెర్ల పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు చేశారు.


● **సోమల:** మండలంలోని పట్రపల్లె ఆలయంలో అమ్మవారిని మీనాక్షిదేవి అలంకరణ, కందూరు పాలేటమ్మ, కందూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారికి చందనం అలంకరణ, సోమల బోయకొండ గంగమ్మ వారికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు.

● **పలమనేరు:** పలమనేరు మున్సిపాలిటి గంటావూరు కాలనీలో అమ్మవారికి అన్నపూర్ణేశ్వరి అలంకరణ, సత్యగంగమ్మ గుడిలో అమ్మవారికి మహాలక్ష్మి అలంకరణ చేశారు.


● **గంగవరం:** మండలంలోని మేలుమాయి క్రాస్‌లో వెలసిన మలాలమ్మ అమ్మవారు గురువారం గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

●**నదుం:** జాంద్రపేటలో వెలసిన రామలింగ చౌడేశ్వరి దేవి గురువారం అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నదుమమ్మ, పచ్చర్లమాకులపల్లెలో వెలసిన శ్రీ గంగాపురమ్మ అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

● **వి.కోట:** వి.కోటలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు అమ్మవారు కాత్యాయిని దేవిగా కొలువు తీరి భక్తులకు దర్శమిచ్చారు.



ముత్యాలకవచం అలంకరణలో కన్యకా పరమేశ్వరి



రామకుప్పం: ఆనిగానూరులో వాసవి కన్యకాపరమేశ్వరి




గుడుపల్లె: కాత్యాయణీదేవి అలంకరణలో రాళ్లగంగమాంబ



రొంపిచెర్లలో ముత్యాలమ్మ అమ్మవారు



సోమల మండలం పట్రపల్లెలో మీనాక్షిదేవి



పలమనేరు అన్నపూర్ణేశ్వరి అలంకరణ

దౌర్జన్యంగా భూమి లాక్కొంటున్నారు



ఆర్డీవో భవానికి వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

పలమనేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకులోని సీకే రాజేశ్వరికి చెందిన వ్యవసాయ భూమిని తహసీల్దారు, ఏపీఐఐసీ అధికారులు దౌర్జన్యంగా లాక్కొనేందుకు ప్రయత్నించారని.. ఆమెకు న్యాయం చేయాలని గురువారం వాల్మీకి సంఘ నాయకులు ఆర్డీవో భవానికి వినతిపత్రం అందజేశారు. కేసు విచారణ కాకుండానే ఈనెల ఆమెను 24న బెదిరించి పోలీసుల సహకారంతో దౌర్జన్యంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు పి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామచంద్రస్వామి మంటపోత్సవం



తీర్థంలో జరిగిన రామచంద్రస్వామి మంటపోత్సవం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో వెలసిన రామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మంటపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రమేష్ ఆచార్యులు సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మేళతాళాలతో స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమానికి రామచంద్రరావు, మునికృష్ణాచారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

ఘనంగా దీనదయాళ్ జయంతి





నివాళులర్పిస్తున్న తులసీనాథ్, ఓఎన్ కొత్తూరులో కూటమి నివాళులు

కుప్పం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో గురువారం బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్ఎస్.తులసీనాథ్ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి ఘనంగా నిర్వహించారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కమతమూరులో దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

● **గుడుపల్లె:** మండలంలోని ఓఎన్ కొత్తూరు పంచాయతీ కేంద్రంలో పండిట్ దీన దయాల్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షు రామచంద్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పండిట్ దీనదయాల్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బేటప్ప నాయుడు, రెస్కో డెరెక్టర్ అమీర్ నేతలు సత్యప్ప నాయుడు, వెంకటస్వామి, రవీంద్ర, వెంకటప్ప, లోకేష్, శ్రీనివాసుల నాయుడు, మణికంఠ, రాబచంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

● **గంగవరం:** పండిట్ దీనదయాల్ జయంతి సందర్భంగా గురువారం బీజేపీ నాయకులు కీలపల్లె పంచాయతీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకుమార్, నాగరాజు, రామకృష్ణారెడ్డి, వెంకటాద్రి, సరవణ, శ్రీనివాసులు, ఉమామహేష్, మధు, చలపతి, సోమశేఖర్, నవీన్ ఆంజనేయులు, రమణ, శేఖర్‌రెడ్డి, ప్రవీణ్, నందకుమార్, ముబారక్ పాల్గొన్నారు.



గంగవరంలో నివాళులర్పిస్తున్న బీజేపి నేతలు

చెత్త తొలగింపునకు శ్రమదానం



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెత్త తొలగింపు కోసం ప్రతి ఒక్క పౌరుడు నెలకు ఒక్కరోజు శ్రమదానం చేయాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పలమనేరు మున్సిపాలిటీలోని బాపూజీ ఉద్యానవనంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఉద్యానవనం లోని చెత్తాచెదారాన్ని తొలగించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యమని, ఇందుకోసం ప్రతిఒక్కరూ కనీసం నెలకు ఒక్కరోజు శ్రమించి పరిసరాలు శుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎస్.ఎం.ఖాదర్‌మొహిద్దీన్, ఏఈ స్నేహప్రియ, టీపీవో ఇందిర, మెప్మా సీఎంఎం బాబా, నాగమణి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు శ్రీపురం సీతారామయ్య, పలమనేరు పరిరక్షణ సమితి సిద్దయ్య, నరసింహులు, వనపరిరక్షణ సమితి సభ్యులు దేవేంద్ర, కౌన్సిలర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సీవోలు, ఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శ్మశాన ఆక్రమణలు తొలగించాలని ధర్నా



తోపుమఠం వద్ద వాహనాలను అడ్డుకుంటున్న మహిళలు

పుంగనూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు శివార్లలోని తోపుమఠం వద్ద ఉన్న దళితుల శ్మశాన ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని తోపుమఠం, తూర్పుపాళ్యం వాసులు గురువారం తోపుమఠం వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేశారు. సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ హరిప్రసాద్ చేరుకుని పలమనేరు ఆర్డీవో, జిల్లా సర్వేయర్‌తో మాట్లాడి సర్వే చేయిస్తామని, రికార్డుల ప్రకారం న్యాయం జరుగుతుందని హామీ ఇవ్వడంతో విరమించారు.

కడపనత్తంలో వైద్యసేవలు



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో గురువారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయచందర్ వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తిచేయండి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడిచెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. అనంతరం ఆయన గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో ఆనంద బాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, డీఆర్పీ మోహన్‌రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెస్కో డైరెక్టర్ అమీర్‌కు సన్మానం



రెస్కో డైరెక్టర్ అమీర్‌ను సన్మానిస్తున్న కూటమి నేతలు

గుడుపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓఎన్ కొత్తూరు గ్రామంలో రెస్కో డైరెక్టర్ అమీర్‌ను కూటమి నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. జనసేన మండలాధ్యక్షులుగా ఉన్న అమీర్ ఇటీవల రెస్కో డైరెక్టరుగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బేటప్ప నాయుడు, బీజేపీ మండలాధ్యక్షులు రామచంద్రుడు, నేతలు రవీంద్ర, వెంకటప్ప, లోకేష్, శ్రీనివాసుల నాయుడు, సత్యప్ప నాయుడు, వెంకటస్వామి, అశోక్, మణికంఠ, రామచంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


సాయిబాబా ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం


వీరాంజనేయస్వామి ఆలయంలో హయగ్రీవ అలంకారం


కోదండరామాలయంలో కూర్మావతారం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో శరన్నవ రాత్రి ఉత్సవాలను నిర్వాహకులు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం గిరింపేటలోని దుర్గాంబ గురువారం పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలక మండలి చైర్మన్ దిలీప్ రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, వరుణ్ కుమార్, వీకే విశ్వనాథ్, కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కట్టమంచి సాయిబాబా ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవిగా, తేనెబండలోని ముత్యాలమ్మ.. లలితాదేవిగా భక్తులను అనుగ్రహించారు. పొన్నియమ్మ గుడివీధిలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు హయగ్రీవ స్వామి అలంకారంలో, రాములవారి గుడివీధిలోని కోదండరామాలయంలో స్వామివారు కూర్మావతారంలో భక్తులను అనుగ్రహించారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలి

వెదురుకుప్పం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పట్టణంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమణలను దుకాణాదారులు స్వచ్ఛందంగా తొలగించాలని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆక్రమణలు పెరిగి ట్రాఫిక్ సమస్యతో నిత్యం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ మార్గంలోనే ఎస్ఆర్‌పురం మండలం నెలవాయిలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీకి చెరకు ట్రాక్టర్లు వెళతాయన్నారు. దీనివల్ల రాకపోకలకు మరిన్ని సమస్యలు తలెత్తుతాయన్నారు. అందువల్ల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ ఉత్తర్వులను కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం అందించారు. కార్యాలయంలో పీహెచ్ వర్కర్‌గా పనిచేస్తున్న వేదవతి ఈ ఏడాది మార్చిలో మృతి చెందారు. వేదవతి కుమారుడు దుర్గాప్రసాద్‌కు కారుణ్య నియామకం కింద ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగమిచ్చారు.

స్వచ్ఛతా హీ సేవ

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాత కలెక్టరేట్‌లోని ఎన్‌సీసీ క్యాంపు కార్యాలయంలో 35 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఆర్మీ అధికారి, లెఫ్టినెంట్ కల్నల్ లోకనాథన్, ఎన్‌సీసీ అధికారి రమేష్ పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు: ఆర్డీవో


వెట్టిచాకిరీ చేయించిన వారిని హెచ్చరిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

గుడిపాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం గట్రాళ్లమిట్ట పంచాయతీలో ఏడు కుటుంబాలకు చెందిన సుమారు 23 మందితో సుమారు 20 ఏళ్లగా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని రోప్స్ సంస్థకు సమాచారం అందడంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఆదేశాలతో తహసీల్దార్ గ్రామానికెళ్లి బాధితులకు విముక్తి కల్పించారు. బాధితుల్లో బంగారుపాళ్యంకు చెందిన మూడు కుటుంబాలు, తమిళనాడులోని అనైకట్టుకు చెందిన నాలుగు కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. రోప్స్ సంస్థ ప్రతినిధి రమేష్ పాల్గొన్నారు. కాగా, ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున గురువారం రాత్రి జేసీ విద్యాధరి అందజేశారు.

పుస్తకాల వితరణ



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని గురువారం 37వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భగవద్గీత, తదితర ఆధ్యాత్మిక పుస్తకాలను విద్యార్థులకు వితరణ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దుర్గా రామక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంకు అభివృద్ధికి సహకరిస్తా: డీసీవో


లక్ష్మిని సన్మానిస్తున్న రమేష్ నాయుడు తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు అభివృద్ధికి సహకరిస్తానని జిల్లా సహకారశాఖ అధికారి (డీసీవో) లక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లో డీసీవోను టౌన్‌బ్యాంకు చైర్మన్ కాండ్ర రమేష్ నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్యాంకు అభివృద్ధికి చేపట్టబోతున్న నూతన సంస్కరణలను చైర్మన్ వివరించారు. బకాయిల వసూళ్లపై పాలకవర్గం దృష్టిపెట్టాలని డీసీవో సూచించారు. బ్యాంకు డైరెక్టర్లు సురేష్, అన్వర్ బాషా, నరసింహులు, ఇన్‌చార్జి సీఈవో సుమతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: ఆర్డీవో


సిబ్బందికి సూచనలిస్తున్న నగరి ఆర్డీవో అనుపమ

వెదురుకుప్పం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరి ఆర్డీవో అనుపమ ఆదేశించారు. గురువారం కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాకాకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ నాగరాజును ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

పార్కులో చెత్తాచెదారం తొలగింపు

నగరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏక్‌దిన్, ఏక్‌గంట, ఏక్ సాత్ అనే కార్యక్రమంలో భాగంగా కుశస్థలీ నది ఒడ్డున ఉన్న పార్కులోని చెత్తాచెదారాన్ని గురువారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కమిషనర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' సమస్యల పరిష్కారానికి నేడు, రేపు ప్రత్యేక కార్యక్రమాలు

యాదమరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల జమలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి శుక్ర, శనివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏవో దీప తెలిపారు. శుక్రవారం.. కమ్మపల్లె, గొల్లపల్లె, దాసరపల్లె, కీనటంపల్లె, మాధవరం, మోర్దానపల్లె, సిద్దారెడ్డిపల్లె, తెల్లరాళ్లపల్లె, వరదరాజులపల్లెలో, శనివారం మిగిలిన గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కుంభాదేవిగా మరగదాంబిక


కాణిపాకం: కుంభాదేవి అలంకారంలో మరగదాంబిక


పాలసముద్రం: బ్రహ్మచారిణి దేవిగా చెవిటి గంగమ్మ


శ్రీరంగరాజపురం: అన్నపూర్ణా దేవిగా గంగమ్మ


విజయపురం: కాత్యాయనీ దేవిగా కనకదుర్గమ్మ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మరగదాంబిక అమ్మవారు కుంభాదేవి అలంకారంలో భక్తులను కరుణించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కుంకుమార్చన నిర్వహింపజేశారు. ఈవో పెంచలకిషోర్, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలో ఉన్న చెవిటిగంగమ్మ అమ్మవారు బ్రహ్మచారిణిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లెలోని గంగమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉభయదారులుగా జీవరత్నమ్మ, గోపాల్‌రెడ్డి కుటుంబీకులు వ్యవహరించారు.

విజయపురం: మండల కేంద్రంలోని మిట్టూరులో ఉన్న కనకదుర్గమ్మ.. కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. ఉభయదారుగా హైకోర్టు న్యాయమూర్తి శ్రీధర్‌రాజు వ్యవహరించారు.

నగరి: పట్టణంలోని దేశమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కరకంఠేశ్వర ఆలయంలో కామాక్షిదేవికి బాల త్రిపుర సుందరి అలంకరణ చేశారు. ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవిని కూష్మాండ దుర్గగా అలంకరించారు.

గంగాధరనెల్లూరు: గ్రామంలోని అల్లియెల్లమ్మ.. సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా పద్మావతి, తంగవేలు నాడార్ కుటుంబీకులు వ్యవహరించారు. రాత్రి అమ్మవారిని ఊరేగించారు. ● మోతరంగనపల్లెలోని ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

బంగారుపాళ్యం: గ్రామదేవత ముత్యాలమ్మ.. లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బంగారుపాళ్యంకు చెందిన రాజేంద్రప్రసాద్, నిర్మల, సింధు, భరత్, డాక్టర్ లోహిత్,శ్వేత వ్యవహరించారు.

వెదురుకుప్పం: డీఆర్ఎస్‌కండ్రిగలోని కొండ మల్లీశ్వరస్వామి ఆలయం సముదాయంలో ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు కటాక్షించారు. ● కార్వేటినగరం మండలం డేరాకండ్రిగలోని నైనేరమ్మ.. కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా జె.కృష్ణమూర్తి-సుబ్బులమ్మ, సుబ్రహ్మణ్యం-భారతి దంపతులు వ్యవహరించారు. కార్వేటినగరం స్కంధ పుష్కరిణి వద్ద ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు కూడా కాత్యాయనీదేవిగా భక్తులను అనుగ్రహించారు.


నగరి: లలితా త్రిపుర సుందరి దేవిగా దేశమ్మ


గంగాధరనెల్లూరు: సంతాన లక్ష్మిగా అల్లియెల్లమ్మ


బంగారుపాళ్యం: లలితా త్రిపుర సుందరీ దేవిగా ముత్యాలమ్మ


వెదురుకుప్పం: కాత్యాయనీ దేవిగా రాజరాజేశ్వరిదేవి


కార్వేటినగరం: కాత్యాయనీ దేవిగా నైనేరమ్మ

పాలసముద్రం మండలంలో కలెక్టర్ పర్యటన

పలు అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల మంజూరుకు హామీ


టీపీఎన్ఆర్‌పురంలో వర్షాలకు కూలిన ప్రాథమిక పాఠశాల ప్రహరీని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాలసముద్రం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. పాఠశాల భవనాలు, తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంగళ్రాజుకుప్పం, తిరుమలరాజుపురం గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న ఆర్గానిక్ ఫామ్‌లను పరిశీలించి, సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం గోడలు బీటలువారి పెచ్చులూడుతుండటంతో మరమ్మతులకు అంచనాలను పంపాలని పీఆర్ ఏఈ జయరాజ్‌ను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిన టీవీఎన్ఆర్ పురం ప్రాథమిక పాఠశాల ప్రహరీని పరిశీలించారు. గోడ నిర్మాణానికి నిధుల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పలు పాఠశాలల్లో నాడు-నేడు కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని, త్వరగా పూర్తి చేయించాలని ఎంపీపీ శ్యామలా శివప్రకాష్ రాజు విన్నవించగా, నివేదికలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గంగమాంబాపురం పంచాయతీలోని చెరువుల్లో పూడికతీతకు నిధులు కావాలని సర్పంచ్ హరి కోరారు. గుంతలమయంగా ఉన్న చిత్తూరు-బలిజకండ్రిగ రోడ్డును మరమ్మతులు చేయించాలని ప్రజలు విన్నవించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో సతీష్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాడిరైతులకు అండగా చంద్రబాబు


మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్న రుద్రయ్యనాయుడు

పెనుమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ఎల్లప్పుడూ అండగా సీఎం చంద్రబాబు ఉంటారని మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు కొనియాడారు. గురువారం తాటిమాకులపల్లెలో పాడి రైతులకు పశుగ్రాసం కోసం జొన్నలు, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. తొలి విడతలో మండలంలో 3550 కిలోల మొక్కజొన్నలు పంపిణీ చేసినట్లు పశువైద్యుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు మోహన్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గాపురం సమీపంలోని గుట్టపై అక్రమ మైనింగ్ ఆపేయాలి : సీపీఐ


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం వనదుర్గాపురం సమీపంలోని గుట్టపై అక్రమ మైనింగ్‌ను ఆపేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పార్టీ నాయకులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. వేలాది లోడ్లతో గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించుకుపోతున్నా.. మైనింగ్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ సుమిత్‌కుమార్ జోక్యం చేసుకుని అక్రమ మైనింగ్ వ్యాపారం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు పాల్గొన్నారు.

సహకార సంస్థలతో విద్యార్థులకు ప్రయోజనం


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సహకార సంస్థలతో విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందని జిల్లా సహకారశాఖ అధికారి లక్ష్మి, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అన్నారు. సహకార సంస్థల అంతర్జాతీయ సంవత్సరం-2025పై గురువారం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డిప్యూటీ మేనేజర్ చలపతి, బ్రాంచ్ మేనేజర్ రఘుబాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీనివాసులు, ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైన సేవ: ఎమ్మెల్యే


టీచర్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైన సేవ అని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. గురువారం విజయవాడలో నిర్వహించిన డీఎస్సీ ఉత్సవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తన నియోజకవర్గం నుంచి టీచర్లుగా ఉద్యోగాలు పొందినవారికి నియామకపత్రాలను అందించారు.

రిలయన్స్ మార్ట్ పాయింట్‌లో చోరీ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్‌నగర్‌కాలనీలో ఉన్న రిలయన్స్ మార్ట్ పాయింట్‌లో చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంగారుపాళ్యంకు చెందిన యుగంధర్ అనే వ్యక్తి రిలయన్స్‌మార్ట్ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. ఐదారు నెలలుగా ఇంటికి వెళ్లేటప్పుడు మార్ట్‌లోని కొన్ని వస్తువులను దొంగతనంగా తీసుకెళుతున్నాడు. లెక్కల్లో తేడా రావడంతో సిబ్బందిపై నిర్వాహకులు నిఘా పెట్టారు. గురువారం కొన్ని వస్తువులను ఎత్తుకెళుతుండగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

సాగులోని పంటల పరిశీలన


రైతులకు సూచనలిస్తున్న మురళీకృష్ణ

గుడిపాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిమ్మయ్యపల్లె, ఏఎల్‌పురం గ్రామ పంచాయతీలో సాగులోని పంటలను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. ఈ-పంట నమోదుపై సిబ్బందికి సూచనలిచ్చారు. ఏవో సంగీత పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


శ్రీవారి ఆలయం ముందు హేమలత, నాని, చంద్రప్రకాష్, దొరబాబు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం పలువురు టీడీపీ ప్రజా ప్రతినిధులు దర్శించుకున్నారు. వీరిలో.. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ ఉన్నారు.

'లోక కళ్యాణ్ మేళా'ను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో ప్రసంగిస్తున్న గుణశేఖర్

నగరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'పీఎం స్వానిధి లోక కళ్యాణ్ మేళా'ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సూచించారు. ఈ పథకంపై గురువారం మెప్మా కార్యాలయంలో వీధి, చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, ఏకాంబరకుప్పం ఇండియన్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, లేబర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, ఫోన్‌పే అగ్రిగేటర్స్ సోము, పవన్, మెప్మా సిటీ మేనేజర్ ఎన్.ప్రసాద్, ఆర్పీలు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం సాయంత్రం లోక కళ్యాణ్ మేళాపై బ్యాంకు అధికారులు, మెప్మా ఆర్పీలు, పీవోలతో సమన్వయ సమావేశాన్ని కమిషనర్ నరసింహ ప్రసాద్ నిర్వహించారు. మెప్మా పీడీ రవీంద్ర, సహాయ కమిషనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

దీనదయాళ్‌కు నివాళి

గుడిపాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా గురువారం ఆయనకు పలువురు నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా నేత చిట్టిబాబు ఆధ్వర్యంలో గుడిపాల మండలంలోని రామాపురంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు స్వామినాథ్‌గౌడ్, గోపి, చంద్రం, ఏలుమలై, తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, రాము, పురుషోత్తంరెడ్డి, మునిరెడ్డి, యుగంధర్‌రాజు, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణపై అవగాహన

పెనుమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో టీచర్లకు రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి బదిలీపై శ్రీకాళహస్తికి వెళ్లడంతో ఆమెను సన్మానించారు. సీడీపీవో పద్మసునంద పాల్గొన్నారు.

విజయపురం ఎంపీపీ బాధ్యతల స్వీకరణ


బాలాజీని సన్మానిస్తున్న రోజా

విజయపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయపురం ఎంపీపీగా మంజు బాలాజి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీపీగా ఉన్న జగన్నాథపురం ఎంపీటీసీ జమున అనారోగ్య కారణంగా విధులనుంచి తప్పుకోవడంతో వైస్ ఎంపీపీగా ఉన్న మంజు బాలాజి.. కలెక్టరు ఆదేశాలతో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన గాండ్లకండ్రిగ నుంచి విజయపురం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించగా, మాజీ మంత్రి ఆర్కే.రోజా సన్మానించారు.ఎంపీడీవో రాజేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



నగరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో స్వస్థ్ నారీ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవి ప్రారంభించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఆర్ఎంవో డాక్టర్ ఆర్.వి.మంజుల, వైద్యులు కార్తీకేయన్, జరీనా, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

వెదురుకుప్పం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కలికిరిండ్లుకు చెందిన రాజారెడ్డి కుటుంబీకుల వితరణతో గురువారం అన్నదానం చేశారు. వృద్ధాశ్రమ సూపర్‌వైజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

సత్యసాయిబాబా పాదుకల ఊరేగింపు

పూతలపట్టు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోటుకనుమలో సత్యసాయిబాబా పాదుకలను గురువారం ఊరేగించారు. శ్రీసత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, శ్రీనివాసన్, దేవరాజులు, గజేంద్రరెడ్డి, శంకర్, కృష్ణమనాయుడు, వాసవి, కల్పన, కమలప్రభ పాల్గొన్నారు.